Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శుక్రవారం
30 ఆగస్టు 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 113
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



### ఒవైసీ ఆస్తులను కూల్చేందుకు
## ధైర్యం చాలడం లేదా?

- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చురక
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరును తప్పుబట్టిన బీజేపీ నేత
- ప్రమోషన్ కోసం పని చేస్తున్నారా? అని ఎద్దేవా
- ఒవైసీ కాలేజీలకు అడ్డొచ్చిన విద్యార్థులు పల్లా కాలేజీకి రావడం లేదా? అని నిలదీత

**శుభ తెలంగాణ హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో హైడ్రా పని చేస్తున్న తీరుపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓల్డ్ సిటీలో నిర్మాణాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... హైడ్రా కమిషనర్ రంగానాథ్ తీరును తప్పుబట్టారు. ఆయన ప్రమోషన్ కోసం పని చేస్తున్నారా? లేక ఓ అజెండాతో పని చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా3లో

### హైడ్రా పేరు చెప్పి...
# బెదిరిస్తున్నారు

- హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక
- కొంతమంది అధికారులు హైడ్రా పేరుతో బెదిరిస్తున్నట్లుగా ఫిర్యాదులు వచ్చాయన్న సీఎం
- గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డం పెట్టుకొని బెదిరిస్తున్నట్లు తెలిసిందని వ్యాఖ్య
- వసూళ్లకు పాల్పడేవారిపై దృష్టి సారించాలని విజిలెన్స్‌కు సీఎం ఆదేశాలు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

హైడ్రా పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టి వార్నింగ్ ఇచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ... హైడ్రా పేరుతో కొంతమంది అధికారులు సామాన్యులను బెదిరింపులకు గురి చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డం పెట్టుకొని బెదిరిస్తున్నట్లుగా తెలిసిందన్నారు. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమాయకులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏసీబీ, విజిలెన్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ నిమిత్తం గత - మిగతా3లో

- సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్
- రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ప్రకటనలు చేయాలా?
- రాజకీయ నాయకులు, న్యాయవ్యవస్థ మధ్య పరస్పర గౌరవం ఉండాలి
- రాజకీయ కారణాలతో మేము ఆదేశాలు జారీ చేశామని ఏ వ్యక్తైనా ఎలా చెప్పగలరు?
- 2015 నాటి ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తుల వ్యాఖ్యలు

### సీఎం రేవంత్ రెడ్డికి
# సుప్రీం షాక్

**శుభ తెలంగాణ న్యూఢిల్లీ**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కే కవితకు బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రంలోని అధికార బీజేపీ మధ్య డీల్ కుదరడంతోనే బెయిల్ వచ్చిందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్ స్పందించింది. వ్యక్తులు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నిందితులకు తాము బెయిల్ ఇస్తామా అని ప్రశ్నించింది. 2015 నాటి ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ బైఆర్ గవాయ్, పీకే మిశ్రా, కేవీ విశ్వనాథన్‌లతో - మిగతా3లో



### ఓటుకు నోటు కేసులో
# కీలక పరిణామం

**జగదీశ్ రెడ్డి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు**

- కేసు ట్రయల్‌పై అనుమానాలు వ్యక్తం చేసిన జగదీశ్ రెడ్డి
- అపోహలతో విచారణను బదిలీ చేయలేమన్న సుప్రీంకోర్టు
- అనుమానాల నివృత్తికి స్వతంత్ర ప్రాసిక్యూటర్‌ను నియమిస్తున్నట్లు వెల్లడి



**శుభ తెలంగాణ ఢిల్లీ**

ఓటుకు నోటు కేసుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు ట్రయల్‌ను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అయితే విచారణకు స్పెషల్ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తున్నట్లు తెలిపింది. ఓటుకు నోటు కేసుపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. ఈ కేసు ట్రయల్‌ని భోపాల్‌కి బదిలీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. జగదీష్ రెడ్డి దాఖలు చేసిన బదిలీ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణను ముగించింది. - మిగతా3లో



## ప్రపంచాన్ని వణికిస్తున్న ఎంపాక్స్!


- అక్కడ 610 మందిని బలిగొన్న వైరస్..
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఎంపాక్స్ ముప్పు నేపథ్యంలో భారత్ అప్రమత్తం
- ఎంపాక్స్ కేసులను గుర్తించేందుకు, సరైన చికిత్స అందించేందుకు ఆరోగ్య నిపుణులకు కేంద్రం శిక్షణ

### రాహుల్ గాంధీని కూడా
## రేవంత్ రెడ్డి మోసం చేశారు

- రేవంత్ రెడ్డి చేసేది చిట్ చాట్ కాదు... "చీట్" చాట్ అని ఎద్దేవా
- రాహుల్ గాంధీ రాష్ట్రానికి వస్తే రుణమాఫీపై నిలదీస్తామన్న హరీశ్ రావు
- కొండారెడ్డిపల్లి వెళ్లి రుణమాఫీపై అడుగుదామా? అని సవాల్

**శుభ తెలంగాణ హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో పాటు వారి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కూడా మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి చేసేది చిట్ చాట్ కాదని... "చీట్" చాట్ అని ఎద్దేవా చేశారు. లేనివి ఉన్నట్లుగా చెప్పి మోసం చేయడం ఆయనకు అలవాటే అన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రానికి వస్తే రుణమాఫీపై నిలదీస్తామన్నారు. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదని హితవు పలికారు. కొండారెడ్డిపల్లి, సిద్దిపేటకు వెళ్లి రుణమాఫీపై రైతులను అడుగుదామా? అని సవాల్ చేశారు. రుణమాఫీ కాలేదని ప్రతిరోజూ మీ మంత్రులే చెబుతున్నారన్నారు. ఆగస్ట్ 15 లోగా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నది తన సవాల్ అని, అలా చేశారా? అని ప్రశ్నించారు. రుణమాఫీపై తన సవాల్ ఏమైందో రైతులే - మిగతా3లో



# ప్రపంచాన్ని వణికిస్తున్న ఎంపాక్స్!

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఎంపాక్స్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో ఆరోగ్య నిపుణులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. మధ్య, పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో జూనోటిక్ వైరల్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కాంగో దేశంలో ఎంపాక్స్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ సోకిన వారి సంఖ్య ఇటీవల భారీగా పెరిగింది. కాంగో ఆరోగ్యశాఖ మంత్రి రోజర్ కంబా ప్రకటన ప్రకారం.. ఇప్పటి వరకు 18వేల మందికిపైగా కేసులు రికార్డయ్యాయి. ఇందులో కనీసం 610 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. విస్తరిస్తున్న వైరస్ మధ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వైరస్ ప్రధానంగా లైంగిక సంబంధాలు, వైరస్ సోకిన వ్యక్తులకు దగ్గరగా ఉండడం, రోగులు వాడిన దుస్తులు వాడడం వల్ల వైరస్ సోకుతుందని నిపుణులు సూచించారు.



కాంగోతో సహా అనేక దేశాల్లో కొత్త ఎంపాక్స్ స్ట్రెయిన్‌పై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు వైరస్ ఊహించినదానికంటే చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందని, రూపంలోనూ మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, వైరస్‌ను సరిగ్గా ట్రాక్ చేసేందుకు అనువైన సౌకర్యాలు లేకపోవడం, వైరస్ తీవ్రత, వ్యాప్తి చెందుతున్న మార్గాలు వంటి ఎన్నో తెలియని విషయాలు ఉన్నాయని.. వీటన్నింటిపై మరోసారం అధ్యయనం నిర్వహించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంపాక్స్ విజృంభణ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ రెండోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ఆ తర్వాత ఎంపాక్స్ కొత్త స్ట్రెయిన్, క్లాడ్ ఐబీ గుర్తించారు. ఇదే కేసుల పెరుగుదలకు దారితీసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

నైజీరియాలోని డెల్టా యూనివర్సిటీ హాస్పిటల్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజ్ స్పెషలిస్ట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ఎమర్జెన్సీ కమిటీ చైర్మన్ డాక్టర్ డిమి ఒగోయినా మాట్లాడుతూ ఆఫ్రికాలో ఎంపాక్స్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. వైరస్ వ్యాప్తి పెరుగుతోందన్న ఆయన.. వైరస్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేదన్నారు. వైరస్ పరివర్తన, కొత్త స్ట్రెయిన్‌లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు అమెరికా, స్వీడన్, థాయ్‌లాండ్‌లో అనేక కేసులు పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఎంపాక్స్ ముప్పు నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టింది. అనుమానిత కేసులను గుర్తిస్తే చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసింది. ఎంపాక్స్ కేసులను గుర్తించేందుకు, సరైన చికిత్స అందించేందుకు ఆరోగ్య నిపుణులకు కేంద్రం శిక్షణ కార్యక్రమాలను సైతం ప్రారంభించింది. అయితే, భారత్‌లో ఇప్పటి వరకు కేసులు నమోదుకాకపోవడం ఊరటనిచ్చే విషయం

# మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యర్థిని ఓడించిన రాహుల్ గాంధీ

లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సరికొత్త లుక్‌లో కనిపించారు. ఈ క్రమంలో వెలుగులోకి వచ్చిన వీడియోలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ ట్రిక్స్ నేర్చుకుంటున్నట్లు కనిపించారు. అందుకు సంబంధించిన వీడియోను తన అధికారిక ఖాతాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ జియు-జిట్సు టెక్నిక్‌ని ఉపయోగించి ప్రత్యర్థి ఆటగాళ్లను ఓడించడం కనిపించింది. రాహుల్ గాంధీ ఈ ప్రత్యేక వీడియో ద్వారా జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**గతంలో ఓడిన రాహుల్**

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత రాహుల్ గాంధీ తన పంథాను మార్చుకుని ప్రజా సమస్యల గురించి ప్రస్తావిస్తూ భారత్ జోడో యాత్రను నిర్వహించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు, ఆ తర్వాత మణిపూర్ నుంచి గుజరాత్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కొంత



ప్రయోజనం చేకూర్చిందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సంఖ్య 99కి పెరిగింది. జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ దేశంలోని వివిధ సమాజిక వర్గాల ప్రజలను కలుసుకున్నారు. ఆ క్రమంలో పలు రకాల వీడియోలను విడుదల చేశారు.

**కారణమిదే..**

అయితే తాజాగా విడుదల చేసిన వీడియో కూడా భారత్ జోడో న్యాయ్ యాత్ర కాలం నాటిదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాహుల్ పర్యటనలో భాగంగా సాయంత్రం శిబిరంలో మార్షల్ ఆర్ట్ జియు-జిట్సు సాధన చేశారు. యువతలో హింసకు బదులు సౌమ్యత విలువను పెంపొందించడమేనని రాహుల్ గాంధీ అన్నారు. ఈ రోజు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుం టున్నాం.

**మార్షల్ ఆర్ట్ క్రీడ**

ఇప్పుడు జియు-జిట్సు అనేది బ్రెజిల్ మార్షల్ ఆర్ట్. దీనిలో ప్రత్యర్థిని పట్టుకోవడం ద్వారా నియంత్రించాలి. దీనిని అని కూడా అంటారు. కరాటే, బాక్సింగ్ లాగా ఇందులో ప్రత్యర్థికి దెబ్బ తగలదు. రాహుల్ గాంధీ కూడా జియు-జిట్సులో బ్లాక్ బెల్ట్ హోల్డర్. గతంలో రాహుల్ గాంధీ సముద్రంలో ఈదుతూ ప్రదర్శించారు. ఈ వీడియో చూసిన పలువురు అనేక విధాలుగా కామెంట్లు చేస్తున్నారు. ఈ క్రేజీ వీడియో ఎలా ఉందో మీరు కూడా ఓ లుక్కేయండి మరి.

## డాక్టర్లను బెదిరించలేదు.. క్లారిటీ ఇచ్చిన మమతా బెనర్జీ



**కోల్‌కతా:** బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిరసన చేపడుతున్న డాక్టర్లను బెదిరించినట్లు బీజేపీ ఆరోపణలు చేసిన నేపథ్యంలో స్పందించారు. తన పట్ల విష ప్రచారం జరుగుతున్నట్లు దీదీ పేర్కొన్నారు. తానేమీ డాక్టర్లను బెదిరించలేదన్నారు. బుధవారం తన ప్రసంగం లో డాక్టర్ల అంశాన్ని ప్రస్తావించలేదన్నారు. మెడికో విద్యార్థులు కానీ, వాళ్ల ఉద్యమం గురించి తానేమీ మాట్లాడలేదన్నారు. డాక్టర్లు చేపడుతున్న ఆందోళనకు సపోర్టు ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వాళ్లు పోరాటం సత్యమైందన్నారు. ఎన్నడూ వాళ్లను బెదిరించలేదన్నారు. డాక్టర్లను బెదిరించినట్లు తనపై కొందరు ఆరోపణలు చేస్తున్నారని, ఆ ఆరోపణలు అవాస్తవం అని దీదీ తెలిపారు. తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో ఆమె ఈ విషయాన్ని చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడానని, ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం సాయంతో రాష్ట్రంలో ఆ పార్టీ అరాచకం సృష్టిస్తోందని, అందుకే ఆ పార్టీకి వ్యతిరేకంగా తన స్వరం వినిపించినట్లు మమతా బెనర్జీ తెలిపారు.

## చనిపోయిన తర్వాత మూడు కాల్స్..

కోల్‌కతాలోని ఆర్ జీ కర్ వైద్య కళాశాలలోని జూనియర్ డాక్టర్ మృతి కేసులో మిస్టరీ వీడటం లేదు. సీబీఐ దర్యాప్తు చేస్తున్నా అసలు విషయం బయటకు రావడం లేదు. ఇప్పటికే ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటగా స్వీకరించి విచారణ ప్రారంభించింది. అభయ చనిపోవడానికి ముందు రోజు రాత్రి తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడింది. ఆ సమయంలో ఇదే చివరి కాల్ అవుతుందని ఎవరూ ఊహించలేదు. దీంతో ఎప్పటిలాగే తన కుమార్తెతో మాట్లాడి పెట్టేసింది. ఆ తరువాత రోజు అంటే ఆగష్టు9వ తేదీ ఉదయం అరగంట వ్యవధిలో ఆసుపత్రి నుంచి వచ్చిన మూడు ఫోన్ కాల్స్ ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. వారి ఆనందాన్ని చిన్నాభిన్నం చేసింది. ఇంతకీ ఆ మూడు కాల్స్ ఎవరు చేశారు. ఏమి మాట్లాడారనే సమాచారం బయటకు వచ్చింది.

ఆర్ జీ కర్ ఆసుపత్రి నుంచి ఆగష్టు9వ తేదీ ఉదయం 10.53 గంటలకు మొదటి కాల్ వచ్చింది. ఒక మహిళ ఆ కాల్‌లో మాట్లాడారు. ఫోన్‌ను అభయ తండ్రి లిఫ్ట్ చేయగా వారి మధ్య జరిగిన సంభాషణ..

# కోల్‌కతా ఘటనతో పాటు ఇతర ఘటనలపైనా స్పందించాలి

కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడి ఘటన దేశవ్యాప్తంగా పెను దుమారం రేపింది. ఈ ఘటనను పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఖండించడంతో పాటు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముర్ము ప్రకటనను స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రకటన చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించడం సంతోషకరమని ఆయన అన్నారు. మహిళల భద్రతకు సంబంధించి ఈ ఘటనపై మనమందరం పెదవివిప్పడం కీలకమని చెప్పారు. రాష్ట్రపతి కేవలం ఘటనపై మాట్లాడటమే కాకుండా ఇతర ఘటనలపై కూడా స్పందించాలని సూచించారు. జన్మాష్టమి నాడు ఫరక్కాబాద్‌లో ఇద్దరు దళిత బాలికలు ఉరికి వేలాడుతూ కనిపించిన ఘటనపైనా ఇదే స్థాయిలో రాష్ట్రపతి ప్రస్తావించాలని అన్నారు. మహారాష్ట్రలో బద్లాపూర్, రత్నగిరి, పుణే,



కొల్హాపూర్ సహా పలు ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న లైంగిక వేధింపుల ఘటనలపైనా ఆమె మాట్లాడాలని కోరారు. ఈ ఘటనలన్నీ కూడా దేశాన్ని షాక్‌కు గురిచేసినవేనని చెప్పారు. జోధ్‌పూర్‌లో నిన్న జరిగిన ఘటన కూడా అందరి హృదయాలనూ కలిచివేస్తోందని అన్నారు. ఈ హేయమైన నేరాలపై కూడా రాష్ట్రపతి మాట్లాడాలని ఆయన కోరారు.

# బెంగళూరులో షాకింగ్ ఘటన

**8 ఏళ్ల బాలిక కడుపులోంచి బయటపడ్డ క్రికెట్ బాల్ సైజు హెయిర్ బాల్!**

**బాలిక ట్రైకోఫాగియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు**

**ఈ వ్యాధి ఉన్నవారికి జుట్టు తినే కంపల్సివ్ అలవాటు ఉంటుందన్న డాక్టర్లు**

**అరుదైన ఆపరేషన్ నిర్వహించిన బెంగళూరులోని ఆస్టర్స్ చిల్డ్రెన్స్ అండ్ ఉమెన్ ఆసుపత్రి**



బెంగళూరులో ఓ అరుదైన ఘటన వెలుగు చూసింది. 8 ఏళ్ల బాలిక కడుపులో నుంచి క్రికెట్ బాల్ సైజులో ఉన్న హెయిర్ బాల్‌ను వైద్యులు ఆపరేషన్ చేసి తొలగించారు. కాగా, బాధిత బాలిక ట్రైకోఫాగియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి ఉన్నవారికి జుట్టు తినే కంపల్సివ్ అలవాటు ఉంటుందట. దీన్నే రాపుంజెల్ సిండ్రోమ్ అని కూడా పిలుస్తారని వైద్యులు వెల్లడించారు. ఇక బాధిత బాలిక గత రెండేళ్లుగా ఆకలి లేకపోవడం, తరచుగా వాంతులు చేసుకోవడం వంటివి చూసి ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దాంతో వారు ఆమెను పీడియాట్రిషియన్‌లు, జనరల్ ఫిజిషియన్‌లు, ఈఎన్‌టీ స్పెషలిస్టులతో సహా అనేక మంది వైద్యుల వద్దకు తీసుకువెళ్లారు. కానీ, ఎలాంటి ఫలితం దక్కలేదు. ఎక్కడికిపోయినా... బాలిక ఆరోగ్య పరిస్థితిని గ్యాస్ట్రైటిస్‌గా భావించి దానికి తగ్గట్టుగా మెడిసిన్స్ ఇవ్వడం చేశారు. ఈ క్రమంలో బెంగళూరులోని ఆస్టర్స్ చిల్డ్రన్స్ అండ్ ఉమెన్ ఆసుపత్రిలోని వైద్యులు ఆమెకు ట్రైకోబెజోర్ ఉన్నట్లు గుర్తించారు. బాలిక జీర్ణాశయాంతర ప్రేగులలో భారీ మొత్తంలో జుట్టు పేరుకుపోయినట్లు గుర్తించి వెంటనే సర్జరీకి ఏర్పాట్లు చేశారు. ఓపెన్ స్టమక్ ఆపరేషన్ చేసి హెయిర్ బాల్‌ను తొలగించారు. "ట్రైకోబెజోర్ అనేది చాలా అరుదైనది. ముఖ్యంగా చిన్న పిల్లలలో చాలా అరుదు. ఇది తరచుగా ట్రైకోఫాగియాతో సంబంధం కలిగి ఉంటుంది. ఇది వ్యక్తులు జుట్టును తినే మానసిక రుగ్మతకు దారితీస్తుంది. సాధారణంగా యుక్తవయస్సులో ఉన్న బాలికలలో కనిపిస్తుంది. కానీ, చాలా చిన్న పిల్లలలో కనుగొనడం ఈ కేసు ప్రత్యేకత" అని పీడియాట్రిక్ సర్జన్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మంజీరి సోమశేఖర్ ఐఏఎన్ఎస్‌తో చెప్పారు.

## కంగనా రనౌత్‌పై పంజాబ్ మాజీ ఎంపీ తీవ్ర వ్యాఖ్యలు... మహిళా కమిషన్ ఆగ్రహం

**రైతుల నిరసన వెనుక విదేశీ కుట్ర ఉందన్న కంగనా రనౌత్**

**కంగనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పంజాబ్ మాజీ ఎంపీ**

**మహిళను అవమానించినందుకు చర్యలు తీసుకుంటామన్న మహిళా కమిషన్**



బీజేపీ ఎంపీ, ప్రముఖ సినీ నటి కంగనా రనౌత్‌పై మాజీ ఎంపీ, శిరోమణి అకాలీదళ్ నేత సిమ్రాన్‌జిత్ సింగ్ మాన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గత ఏడాది రైతుల నిరసన వెనుక విదేశీ కుట్ర ఉందంటూ కంగన వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యల మీద పార్టీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి మాటలు పునరావృతం కావొద్దని హెచ్చరించింది. ఈ క్రమంలో ఆమెపై పంజాబ్ ఎంపీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అత్యాచారం ఎలా జరుగుతుందో మీరు ఆమెను (కంగన) అడగాలని, అప్పుడు ప్రజలకూ వివరించవచ్చునని, అత్యాచార విషయాల్లో ఆమెకు చాలా అనుభవం ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలను పంజాబ్ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళను అవమానించారని, ఇందుకు తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మాజీ ఎంపీ వ్యాఖ్యలపై కంగన బృందం స్పందిస్తూ... అత్యాచారాలను చిన్న చూపు చూడటం సర్వ సాధారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసింది.

## కోల్‌కతా ఘటన దర్యాప్తుపై అధిర్ రంజన్ సంచలన వ్యాఖ్యలు




కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రి ఘటనపై కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి స్పందించారు. ఈ కేసులో దర్యాప్తు సజావుగా సాగాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోరుకోవడం లేదని ఆరోపించారు. అధిర్ రంజన్ గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు సవ్యంగా సాగితే ఎన్నో రహస్యాలు వెలుగుచూస్తాయని, ఇలా జరగడం దీదీకి ఇష్టం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే కోల్‌కతా ఘటన నుంచి ప్రజల దృష్టిమరల్చేందుకు, ప్రజల్ని భయపెట్టేలా ఆమె నానా చెత్తా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కానీ ప్రజలు భయపడరని, కోల్‌కతా ఘటన ఇప్పుడు ప్రజా ఉద్యమంగా మారిందని ఆయన పేర్కొన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అరాచకం సృష్టిస్తోందని బిహార్‌లో విపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటనపై తేజస్వి గురువారం స్పందించారు. మార్కెట్లలో దుకాణాలను కాషాయ శ్రేణులు లూటీ చేస్తున్నాయని ఆరోపించారు. శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేయాలని బీజేపీ కోరుకుంటున్నదని మండిపడ్డారు. వారు ప్రజలను నిరంరం రెచ్చగొడుతూ అలజడులకు ప్రేరేపిస్తున్నారని దుయ్యబట్టారు. కాషాయ పాలకుల ఉచ్చులో బెంగాల్ ప్రజలు చిక్కుకోరని తాము భావిస్తున్నానమని అన్నారు. ఇక లైంగిక దాడుల విషయానికి వస్తే యూపీ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికంగా వెలుగుచూస్తున్నాయని చెప్పారు. బిహార్‌లోనూ లైంగిక దాడుల ఘటనలు తరచూ చోటుచేసుకుంటాయని తెలిపారు. వీటిపై వారు ఎందుకు మౌనంగా ఉంటున్నారని తేజస్వి యాదవ్ నిలదీశారు. బీజేపీ ప్రతిచోటా భయానక వాతావరణం సృష్టించాలని కోరుకున్నా అలా చేయడంలో ఆ పార్టీ ఎప్పుడూ ఫలప్రదం కాలేదని అన్నారు.ల

## ఛత్తీస్ గఢ్‌లో ఎన్ కౌంటర్

మావోయిస్టులకు మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్ గఢ్ లోని నారాయణపూర్, కంకేర్ జిల్లాల సరిహద్దుల్లో నక్సలైట్లు, భద్రతా బలగాల మధ్య ఎన్ కౌంటర్ కొనసాగుతోంది. ఈ ఘటనలో ఇప్పటి వరకు ముగ్గురు మహిళా నక్సలైట్లు హతమయ్యారు. ఎన్ కౌంటర్ జరిగిన స్థలంలో మృతదేహాలు, ఆయుధాలతో పాటు పలు రకాల వస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని పోలీసు అధికారులు వెల్లడించారు. బీఎస్ఎఫ్, జిల్లా రిజర్వ్ గార్డ్స్, ఎస్టీఎఫ్ సిబ్బంది ఎన్ కౌంటర్ లో పాల్గొన్నారు. ఎన్ కౌంటర్ లో భద్రతా బలగాలు సురక్షితంగా ఉన్నాయి. ఉదయం నుంచి ఎన్ కౌంటర్ కొనసాగుతోందని... ఆ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ ను నిర్వహిస్తున్నారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు.

## బెంగాల్‌లో బీజేపీ అరాచకం : తేజస్వి యాదవ్




పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అరాచకం సృష్టిస్తోందని బిహార్‌లో విపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటనపై తేజస్వి గురువారం స్పందించారు. మార్కెట్లలో దుకాణాలను కాషాయ శ్రేణులు లూటీ చేస్తున్నాయని ఆరోపించారు. శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేయాలని బీజేపీ కోరుకుంటున్నదని మండిపడ్డారు. వారు ప్రజలను నిరంరం రెచ్చగొడుతూ అలజడులకు ప్రేరేపిస్తున్నారని దుయ్యబట్టారు. కాషాయ పాలకుల ఉచ్చులో బెంగాల్ ప్రజలు చిక్కుకోరని తాము భావిస్తున్నానమని అన్నారు. ఇక లైంగిక దాడుల విషయానికి వస్తే యూపీ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికంగా వెలుగుచూస్తున్నాయని చెప్పారు. బిహార్‌లోనూ లైంగిక దాడుల ఘటనలు తరచూ చోటుచేసుకుంటాయని తెలిపారు. వీటిపై వారు ఎందుకు మౌనంగా ఉంటున్నారని తేజస్వి యాదవ్ నిలదీశారు. బీజేపీ ప్రతిచోటా భయానక వాతావరణం సృష్టించాలని కోరుకున్నా అలా చేయడంలో ఆ పార్టీ ఎప్పుడూ ఫలప్రదం కాలేదని అన్నారు. కాగా, కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఇచ్చిన బెంగాల్ బంద్ హింసాత్మకంగా మారింది. మరోవైపు కోల్‌కతా దుర్ఘటన అత్యంత దురదృష్టకరమని, ఇది తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

# ఒవైసీ ఆస్తులను కూల్చేందుకు ధైర్యం చాలడం లేదా?

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వంలో వెంకట్రామిరెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చినట్లు మీకు ఇప్పుడు రేవంత్ రెడ్డి ఏమైనా టార్గెట్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. మీకు మీరు పోలీసు అధికారి అనుకుంటున్నారా? లేక రాజకీయ నాయకుడు అనుకుంటున్నారా? అని రంగనాథ్‌ను ప్రశ్నించారు. తనను విమర్శించే ముందు ఆలోచించాల్సింది అన్నారు. హైడ్రా పేరుతో వసూళు జరుగుతున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పారని గుర్తు చేశారు. దీనిని బట్టి హైడ్రా ఎలా నడుస్తుందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

**ఒవైసీ కాలేజీలకు అడ్డొచ్చిన విద్యార్థులు పల్లా కాలేజీకి రాలేదా?**

సల్కం చెరువులోని ఒవైసీ భవనాల కూల్చివేతల విషయంలో విద్యార్థుల భవిష్యత్తు అంటూ రంగనాథ్ నీతులు చెబుతున్నారని, మరి కేఎల్ఆర్ ఇనిస్టిట్యూషన్స్, పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి సంస్థలకు వర్తించదా? అని ప్రశ్నించారు. ఒవైసీ భవనాల కూల్చివేతకు విద్యార్థులు, విద్యా సంవత్సరం అడ్డు వచ్చాయని చెబుతోన్న రంగనాథ్... ఇతర సంస్థల విషయంలో ఆ ఆలోచన ఎందుకు చేయడం లేదన్నారు. 365



రోజులు ఒవైసీ విద్యాసంస్థలు రన్ అవుతుంటే మీకు కూల్చేందుకు సమయం ఎలా చిక్కుతుందో చెప్పాలన్నారు. అలాంటప్పుడు ఎన్ కన్వెన్షన్ కూల్చివేత సమయంలో అడ్వాన్స్ ఇచ్చిన వారి పరిస్థితి ఏమిటో చెప్పాలన్నారు. మీరు కూల్చాలనుకున్న నిర్మాణాలను వెంటనే కూల్చేస్తున్నారని, కానీ మీ మిత్రుడు ఒవైసీకి చెందిన సంస్థలపై సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. అక్బరుద్దీన్ ఒవైసీని ఉపముఖ్యమంత్రిగా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికే అక్బరుద్దీన్ అనధికార ఉపముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. ఒవైసీ భవంతులను కూల్చేందుకు ఈ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం లేదన్నారు.

**ఒవైసీ ఆస్తుల వైపు చూసేందుకు ధైర్యం చాలడం లేదు**

హిందువులు ఉన్న చోట హైడ్రా కూల్చివేతలు చేపడుతోందని, మరి పాతబస్తీకి ఎందుకు వెళ్లడం లేదో చెప్పాలన్నారు. పాతబస్తీకి వెళ్లే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదా? లేదంటే పూర్తిగా ఒవైసీ కనుసన్నుల్లో ఈ ప్రభుత్వం పని చేస్తోందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ఇలాగే మజ్లిస్ పార్టీతో దోస్తీ చేస్తే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఒవైసీ ఆస్తుల వైపు చూసేందుకు కూడా ప్రభుత్వానికి ధైర్యం చాలడం లేదన్నారు. పాతబస్తీలో హైడ్రా ఎందుకు పని చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కూల్చివేతల విషయంలో హైడ్రా ఒక వర్గాన్ని మాత్రమే టార్గెట్ చేస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. ఒవైసీ కాలేజీని కూల్చిన తర్వాతే ఇతర సంస్థలను ముట్టుకోవాలని అల్టిమేటం జారీ చేశారు. తెలంగాణలో స్టీరింగ్ మజ్లిస్ చేతిలో ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు.

# హైడ్రా పేరు చెప్పి... బెదిరిస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

కొన్ని రోజులుగా తెలంగాణ సర్కారు హైడ్రా ద్వారా గట్టి చర్యలు తీసుకుంటోంది. ఇది రాజకీయ రంగు కూడా పులుముకుంది. ఆక్రమణల తొలగింపు పేరుతో మధ్యతరగతి, పేద వర్గాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే మరో వైపు ఆక్రమణ తొలగింపునకు ప్రశంసలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రాపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురువారంనాడు ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ లో హైడ్రా పేరు చెప్పి భయపెట్టి.. బెదిరించి కొందరు కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు మూడేండ్ల కిందటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకొని కొన్ని చోట్ల రెవిన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తప్పవని ఓ ప్రకటనలో రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి వసూళ్లకు పాల్పడే వారిపై ఫోకస్ పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై రాష్ట్ర హై-కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణంలోకి తీసుకుంటూ, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకై హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని అప్పగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై నేడు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ



సమావేశానికి ఇంటలీజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ మహేష్ భగవత్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ అడ్వకెట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి, ఏసిబి డైరెక్టర్ తరణ్ జోషి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయితీ రాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నారని, దీనివల్ల ఒకరకమైన కన్ఫ్యూజన్ ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించటానికి, ఓ.ఆర్.ఆర్.పరిధిలో అన్ని విధాలా ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. జీ.హెచ్.ఎంసీ, ల్యాండ్ ఏంక్రోచ్మెంట్ ఆక్ట్, ల్యాండ్ గ్రాబింగ్ ఆక్ట్, వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారి చేసే అన్ని రకాల నోటీసులు, తొలగింపులన్నీ పూర్తిగా ఒకే విభాగం హైడ్రా పరిధిలోకి తేనున్నట్టు వివరించారు. హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని త్వరలోనే కేటాయించనున్నట్టు తెలిపారు. ఎఫ్.టీ.ఎల్, నాలా ఎంక్రోచ్మెంట్, , ప్రభుత్వ కాళీ స్థలాలు, పార్కుల పరిరక్షణలను హైడ్రా పరిధిలోకి తేనున్నామని చెప్పారు. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువుల పరిరక్షణ కూడా జల మండలి నుండి హైడ్రా పరిధిలోకి తేనున్నామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత బలోపేతం చేయాడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుండి అధికారులు, సిబ్బందిని త్వరితగతిన కేటాయించనున్నట్టు సి.ఎస్. తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, రంగారెడ్డి జిలా కలెక్టర్ శశాంక, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొత్రు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో నామినేటెడ్ చిచ్చు

**నల్గొండ :** ఉమ్మడి నల్లగొండ కాంగ్రెస్ పార్టీలో హేమా హేమిలైన జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బ్రదర్స్, దామోదర్ రెడ్డిలు రాష్ట్ర కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఎవరికి వారే సొంత గ్రూపులతో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సీనియర్లైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రులుగా కొనసాగుతున్నారు. రాజకీయ ఉద్దండులు ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ లో ఓ పదవి చిచ్చు పెట్టింది.నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి రాష్ట్ర మంత్రి కావాలనే చిరకాల వాంఛ.. కలగానే మిగిలిపోయింది. తన కలను తనయుడు అమిత్ రెడ్డితో సాకారం చేసుకోవాలని గుత్తా ప్రయత్నించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి తనయుడి పొలిటికల్ ఎంట్రీకి గుత్తా సుఖేందర్ రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తనయుడు అమిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసం గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి పార్లమెంట్ ఎన్నికలవేళ కాంగ్రెస్ కండువా కప్పించారు. సీఎం రేవంత్ తో గుత్తా సుఖేందర్ రెడ్డి కుటుంబానికి దగ్గరి బంధుత్వం ఉంది.బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డిలకు రేవంత్ సర్కార్ కీలక పదవులు కట్టబెట్టింది. పోచారంను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడిగా, గుత్తా అమిత్ రెడ్డిని రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ కుటుంబంతో ఉన్న బంధుత్వం వల్లే అమిత్ రెడ్డికి కార్పొరేషన్ పదవి వరించిందని పార్టీలో టాక్. అమిత్ రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవికి నామినేట్ చేయడం ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ లో కలకలం రేపుతోంది. ఉమ్మడి నల్గొండ నుంచి ఇప్పటికే పటేల్ రమేష్ రెడ్డి, బంద్రు శోభారాణి, నాగరి ప్రీతం, పాల్వాయి రజనీకుమారిలకు కార్పొరేషన్ పదవులు దక్కాయి.ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఇంకా చాలామంది ఆశావాహులు



ఉన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కూడా కీలకమైన కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారట. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. తన అనుచరుడు గుమ్మల మోహన్ రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్ నాయక్ కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. అద్దంకి దయాకర్, పున్న కైలాస్ నేత ఆశావాహులుగా ఉన్నారు. దీనికి తోడు కేబినెట్ బెర్త్ కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ కూడా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ లో చాలా కాలం నుంచి పనిచేస్తున్న సీనియర్లను కాదని గుత్తా అమిత్.. కీలక పదవి ఇవ్వడంపై ఉమ్మడి జిల్లా సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారట. పార్టీలో కొత్తగా వచ్చిన వారికే పదవులు కట్టబెడితే.. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నేతల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారట. పోచారం శ్రీనివాస్ రెడ్డి, గుత్తా అమిత్ కు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వడంపై పార్టీ అధిష్టానం వద్ద ఓ సీనియర్ నేత తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారట. పార్టీలో కొత్తగా వచ్చిన వారికి పదవులు ఇస్తే పార్టీ క్యాడర్ కు తప్పుడు సంకేతాలు వెళ్తాయని నిరసన వ్యక్తం చేశారట.రాజకీయ భవిష్యత్తు కోసం తనయుడిని గులాబీ దళం నుంచి కాంగ్రెస్ గూటికి చేర్చినా.. గులాబీ పార్టీలో మాదిరిగానే ఇక్కడ కూడా తనయుడి రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకులు తప్పడం లేదట. అయితే తాను ఒకటి తలచితే.. మరొకటి జరిగిందట. ఇప్పుడేం చేయాలో గుత్తా సుఖేందర్ రెడ్డికి పాలు పోవడం లేదట. ఈ నేపథ్యంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డిలకు రేవంత్ సర్కార్ కట్టబెట్టిన కీలక పదవులపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బ్రేక్ పడిందట.

## బీఆర్ఎస్ కు కర్ణాటక అస్త్రం

**హైదరాబాద్ :** తెలంగాణలో సర్కార్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్? అధికారంలోకి వచ్చిన నుంచి ప్రతిపక్షం బీఆర్ఎస్ పై పైచేయి సాధిస్తూ వస్తోంది. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షిస్తూ బీఆర్ఎస్‌పై మాటల దాడి చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ ఒప్పందాలపై విచారణ కమిషన్ నియమించి బీఆర్ఎస్ పెద్దలను టార్గెట్ చేసింది. అప్పుల అంశంతో మొదలుకొని ప్రతి విషయంలో గత ప్రభుత్వ చర్యలను తప్పుపడుతూ సీఎం రేవంత్ రెడ్డి చెడుగుడు ఆడుతున్నారు. తాజాగా హైడ్రా అంశాన్ని బేస్ చేసుకొని మరింతగా విమర్శల దాడి చేస్తోంది కాంగ్రెస్. సీఎం రేవంత్ అటాక్‌తో బీఆర్ఎస్ శిబిరం మొత్తం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అయితే అనుకోని వరంలా కర్ణాటకలో వాల్మీకి కుంభకోణం వెలుగుచూడటంతో బీఆర్ఎస్‌కు కొత్త అస్త్రం దొరికినట్లైంది. ఈ అస్త్రంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రివర్స్ అటాక్ మొదలుపెట్టింది గులాబీదళం.తెలంగాణలో అధికారంలోకి రాక ముందు.. ఇక్కడ పార్టీకి రోల్ మోడల్ కర్ణాటక కాంగ్రెస్ అంటూ విస్తృత ప్రచారం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడ పార్టీకి మంచి జోష్ వచ్చింది. ఇప్పుడు తాజాగా సేమ్ టు సేమ్ కర్ణాటక వ్యవహారం.. తెలంగాణ కాంగ్రెస్ మెడకు చుట్టుకుంటుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటకలో వాల్మీకి కుంభకోణం వెలుగులోకి రావడం? ఆ పథకం లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణతో సిట్ దర్యాప్తు చేస్తోంది. దీంతో కర్ణాటక ప్రభుత్వం 12 మంది అధికారులపై వేటు వేసింది.సంబంధిత మంత్రి కూడా రాజీనామా చేశారు. ఇదంతా బాగానే ఉన్నా.. సిట్ దర్యాప్తులో హైదరాబాద్ లింక్ లు బయటపడటమే స్థానిక నేతలకు ఇబ్బందికరంగా మారింది. పలు ఐటీ కంపెనీలతోపాటు స్థానిక కాంగ్రెస్ నేతల కంపెనీలకు డబ్బులు మళ్లించినట్లు ఆరోపణలు

## సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీం షాక్

-మొదటిపేజీ తరువాయి

కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను న్యాయమూర్తులు తప్పుబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి తరపున వాదించిన లాయర్లు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టు పట్ల గౌరవంతో ఉండాలని, రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం సరికాదని కోర్ట్ వ్యాఖ్యానించింది. "ఇలాంటి ప్రవర్తన కలిగిన వ్యక్తి సీఎం పదవిలో ఉన్నారు. కాబట్టి కేసును బదిలీ చేయాలంటూ పిటిషనర్ కోరినట్టు వేరే రాష్ట్రానికి బదిలీ చేయమంటారా?" అంటూ అడ్వకేట్లు ముకుల్ రోహత్గీ, సిద్దార్థ్ లూథ్రాలను న్యాయమూర్తులు ప్రశ్నించారు. మరోసారి ఇలా జరగదని వారు కోర్టుకు హామీ ఇచ్చారు. ఆయన (ముఖ్యమంత్రి) చేసిన ప్రకటనలు బహిరంగంగా ప్రచురితమయ్యాయని, పోలీసులు ఏదైనా చేస్తే వారిని వీధిలో కొడతారేమో అని సుప్రీంకోర్ట్ వ్యాఖ్యానించింది. " ఆయన ఏమన్నారో మీరు చదివారా. ఒకసారి చదవండి. ఒక ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే అనుమానాలు కలగజేస్తాయి" అని జస్టిస్ గవాయి అన్నారు.

**పరస్పర గౌరవం ఉండాలి**

" రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ప్రకటనలు చేయాలా?. రాజకీయ నాయకులు, న్యాయవ్యవస్థ మధ్య పరస్పర గౌరవం ఉండాలి. రాజకీయ కారణాలతో మేము ఆదేశాలు జారీ చేశామని ఏ వ్యక్తైనా ఎలా చెప్పగలరు?. మీరు మమ్మల్ని గౌరవించనంత మాత్రాన మేము మీ కేసు విచారణను వేరే చోటికి బదిలీ చేస్తామా. ఇది దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం. నిన్ననే మహారాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శికి (అటవీ, రెవెన్యూ శాఖ) నోటీసులు జారీ చేశాం. ఏదైనా రాజకీయ పార్టీని సంప్రదించిన తర్వాత మా ఆదేశాలను జారీ చేస్తామా?. మనస్సాక్షి, ప్రమాణం చేసిన విధంగా మేము మా విధులను నిర్వహిస్తాం" అని సుప్రీంకోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఓటుకు నోటు కేసు బదిలీపై విచారణ విషయానికి వస్తే రేవంత్ రెడ్డి సాక్షులను ప్రభావితం చేయగలరని, సాక్ష్యాలను తారుమారు చేయగలరని పిటిషనర్ల తరపు లాయర్లు వాదించారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్ట్ తెలిపింది.

## రాహుల్ గాంధీని కూడా రేవంత్ రెడ్డి మోసం చేశారు

-మొదటిపేజీ తరువాయి

చెబుతారన్నారు. వ్యవసాయమంత్రి లెక్కల ప్రకారమే రాష్ట్రంలో 22 లక్షల మందికి రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కృతజ్ఞత సభకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి మూడుసార్లు ఆహ్వానించినా రాహుల్ గాంధీ రావడం లేదన్నారు.

**వాల్మీకి కుంభకోణంపై ఆగ్రహం**

వాల్మీకి కుంభకోణంలో పట్టపగలే నిలువు దోపిడీ జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ కుంభకోణంపై సీఎం, మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలన్నారు. ఈ కుంభకోణంపై తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ అంశంలో ఈడీ విచారణను కోరే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా? అని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయి కాబట్టే కుంభకోణంపై ఈడీ దాడులు జరగడం లేదన్నారు. విచారణ జరిపి కుంభకోణంపై బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ అంశంపై తాము ఈడీకి ఫిర్యాదు చేస్తామన్నారు..


## ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం..

-మొదటిపేజీ తరువాయి

ట్రయల్ జరిగే విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున స్పెషల్ ప్రాసిక్యూటర్‌ని నియమిస్తామని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. 'మా న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం' అని జస్టిస్ గవాయ్ అన్నారు. కేసులో నిందితుడు రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ సీఎంగా ఉన్నారని, దర్యాప్తు సంస్థ ఏసీబీ చూసే హోం శాఖ కూడా ఆయన వద్దే ఉందని జగదీష్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా మహబూబ్ నగర్‌లో జరిగిన ర్యాలీల్లో పలుమార్లు పోలీసులపై బెదిరింపు ధోరణి ప్రదర్శించారని జగదీష్ రెడ్డి తరుపు న్యాయవాది తెలిపారు. సీఎంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తేనే కేసుపై ప్రభావం ఎలా ఉందో తెలుస్తుందని, ప్రభుత్వం దాఖలు చేసే కౌంటర్ అఫిడవిట్‌లో కూడా వైఖరి మారిందని జగదీష్ రెడ్డి న్యాయవాది తెలిపారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ని నియమించే వ్యవహారాన్ని సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. తెలంగాణకు చెందిన మా సహచరులను సంప్రదించి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని జస్టిస్ గవాయి తెలిపారు. ఓటుకు నోటు కేసును విచారించే ఏసీబీ (హోంశాఖ) ముఖ్యమంత్రి పరిధిలో ఉందని పిటిషనర్ (జగదీశ్ రెడ్డి) కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. కేసు ట్రయల్‌పై అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ కౌంటర్ అఫిడవిట్‌లో వైఖరి మారిందని జగదీశ్ రెడ్డి న్యాయవాది కోర్టుకు తెలిపారు.

ఈ కేసులో ఎలాంటి విచారణ జరగడం లేదని పేర్కొన్నారు. కేసులో నిందితులుగా సీఎం, హోంమంత్రి ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలోనూ సీఎం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, పోలీసుల సంగతి తేలుస్తామని వ్యాఖ్యలు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అపోహలతో విచారణను బదిలీ చేస్తే న్యాయవ్యవస్థపై నమ్మకం లేనట్లే అవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని... తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని ధర్మాసనం పేర్కొంది. స్వతంత్ర ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని, అందరి అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తున్నట్లు వెల్లడించింది. పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని.. పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నామని త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. కేవలం అపోహలతో విచారణ బదిలీ చేస్తే మన న్యాయవ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'మా న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం' అని జస్టిస్ గవాయ్ తెలిపారు. తెలంగాణకు చెందిన తమ సహచరులను సంప్రదించి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని జస్టిస్ గవాయి వెల్లడించారు. పిటిషన్‌పై విచారణను త్రిసభ్య ధర్మాసనం ముగించింది. స్పెషల్ ప్రాసిక్యూటర్‌ని సుప్రీంకోర్టు నియమిస్తుందని ధర్మాసనం వెల్లడించింది. మధ్యాహ్నం 2 గంటలకు తీర్పు వెలువరిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

## నా ఇంటిని కూల్చివేయొచ్చు సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు



హైదరాబాద్ : హైడ్రా నోటీసులపై సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి స్పందించారు. 2015లో అమర్ సొసైటీలో ఇంటిని కొనుగోలు చేశానని తెలిపారు. తనకు ఇల్లును అమ్మిన యజమాని అన్ని అనుమతులతోనే ఇంటిని నిర్మించారని చెప్పారు. కొనుగోలు చేసేటప్పుడు బఫర్ జోన్‌లో ఉందని యజమాని చెప్పలేదు. తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని ఇప్పుడు తనకు నోటీసులు వచ్చాయి. నిబంధనల ప్రకారం లేకుంటే కూల్చేయొచ్చు. సమయం ఇస్తే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతాను అని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రెడ్డి ఇంటికి హైడ్రా అధికారులు గురువారం నోటీసులు అంటించారు. మాదాపూర్‌లోని అమర్ కో ఆపరేటివ్ సొసైటీలో తిరుపతి రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆ ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో నోటీసులు అంటించారు. మరోవైపు దుర్గం చెరువును అనుకుని ఉన్న కావూరి హిల్స్, నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, అమర్ సొసైటీ వాసులకు కూడా నోటీసులు జారీ చేశారు. నెలలోపు అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని నోటీసుల్లో హైడ్రా అధికారులు పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి...






**-రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి**

**-వీడియో కాన్ఫరెన్సు ద్వారా కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ, వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగుతుందని ,మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పకడ్బందీగా దృష్టిని కేంద్రీకరించాలని, జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షణ జరపాలని సూచించారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, పార్టీలకు అతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకుని ఉంటాయని, ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ హితవు పలికారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21 న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. తుది ఓటరు జాబితాను వెలువరించడానికి ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఏ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా ప్రతీ దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జాగ్రత్తలు సూచించారు. పంచాయతీరాజ్ చట్టం-2018 తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలని అన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. ఎంపిడిఓలు తమతమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించేలా చూడాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రతిఒక్కరు తమతమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజెషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ లను నెలకొల్పి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలని ఎన్నికల కమిషనర్ సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా లో 20 మండలం వారిగా ఓటర్లు ఎంత మంది ఉన్నారు, ఎస్సి ,ఎస్టి, బి సి , కుల గణన వారిగా లిస్టు, మహిళలు, పురుషులు జిల్లా మొత్తం ఎంత మంది ఓటర్లు ఉన్నారనే విషయం ఫిజికల్ వెరిఫికేషన్ చేసి జాబితా ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీఓ వాసుచంద్ర,, ఇంచార్జి డి పి ఓ సంధ్యా రాణి ,డి ఎల్ పి ఓ తాండూర్ శంకర్ నాయక్

# హైడ్రా అక్రమ నిర్మాణాలకు కూల్చివేత జోరందుకుంటే...





**అర్బన్ బఫర్ జోన్ లో ఉన్న అక్రమ నిర్మాణాల సంగతేంటి...?**

**-జిల్లా కేంద్రానికి తాగునీరు అందించే శివారెడ్డి పెట్ చెరువు చుట్టూ నిర్మాణాలే..**

**-డ్రైనేజీ మురుగు నీరు ఎటు పోతుంది..?**

**-బఫర్ జోన్ పరిధిలో లేఔట్లకు అనుమతులు నిబంధనల ప్రకారమే ఇచ్చారా..?**

**-చెరువులను కాపాడడానికి హైడ్రా తరహా లోనే జిల్లాలకు విస్తరింప చేయాలని ప్రజల డిమాండ్..**

**వికారాబాద్ , శుభ తెలంగాణ:** హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు చేపడితే చాలు హైడ్రా గంటల వ్యవధిలో నిర్మాణాలను కూల్చి నేలమట్టం చేస్తుంది. దీంతో బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన చాలామంది వ్యాపారులు, రాజకీయ నాయకుల గుండెల్లో రైళు పరిగెడుతున్నాయి. గత శనివారం టాలీవుడ్ ప్రముఖ హీరో అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెక్షన్ ను హైడ్రా నేలమట్టం చేసింది. అప్పటినుంచి హైడ్రా పబ్లిసిటీ మరింత పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఎవరి నోట విన్న హైడ్రా మాటే వినిపిస్తుంది. ఇలాంటి తరుణంలో హైదరాబాద్ పరిధిలోనే కాక రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, పట్టణాలు, గ్రామాల పరిధిలో ఉన్న చెరువులను కబ్జా చేసి కొందరు అక్రమ వెంచర్లను, ఫామ్ హౌస్ లో నిర్మాణాలు చేపట్టి అక్రమ ఆదాయాలకు శ్రీకారం చుట్టారు.అలాంటివారికి అసలు అనుమాతులు ఎవరు ఇచ్చారు..? గతంలో ఇచ్చిన అనుమతులన్ని నిబంధనల ప్రకారమే ఉన్నాయా అనే విషయాన్ని నిగ్గు తేల్చాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులతో పాటు జిల్లా ఉన్నత యంత్రంగానికి ఉన్నదని సర్వత్ర ప్రజల్లో వ్యక్తం అవుతుంది. వికారాబాద్ పట్టణానికి తాగునీరు అందించే శివసాగర్ చెరువు సమీపంలో ఉన్న ఏరియాను బఫర్ జోన్ ప్రభుత్వ నిబంధనలు అలాంటి పరసరాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొచ్చా..? చట్ట విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసి చెరువులను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇటీవల వారం రోజులపాటు మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు ఆగిపోవడంతో వికారాబాద్ పట్టణం తాగునీటి కటకటతో ప్రజలు అల్లాడారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న శివరెడ్డి పేట్ చెరువుకు ఘన చరిత్ర ఉంది. ఎన్నో ఏళ్లుగా వికారాబాద్ ప్రజల దాహం తీరుస్తున్న శివరెడ్డి పేట్ చెరువు చుట్టూ నిర్మాణాలు వెలిశాయి. కొందరు వ్యాపారులు ఏకంగా లే అవుట్లు చేసి ప్లాట్లు అమ్ముతున్నారు. ఈ వెంచర్లలో నిర్మాణాలు చేపడితే అట్టి నిర్మాణాల నుంచి వచ్చే డ్రైనేజీ వాటర్ శివరెడ్డి పేట చెరువులో కలిసే అవకాశం ఉంది. అలాంటప్పుడు ఈ వెంచర్లకు డిటిసిపి అనుమతులు ఎలా వచ్చాయి అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇవే కాక కొందరు ఏకంగా చెరువులోనే నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా రోజురోజుకు కబ్జాకు గురవుతున్న శివారెడ్డి పెట్ లాంటి చెరువులను కాపాడటంలో భాగంగా ప్రభుత్వం హైడ్రా లాంటి ప్రత్యేక బృందాన్ని జిల్లాల పరిధిలో కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి అటు ప్రజా ప్రతినిధులు గాని ఇటు జిల్లా ఉన్నత యంత్రాంగం గాని చొరవ తీసుకొని అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వెంచర్లను తొలగిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేసినట్లయితే శివ సాగర్ చెరువు చుట్టూ ఉన్న అక్రమ లేఅవుట్లు, నిర్మాణాల బాగోతం బట్టబయలే అవకాశం ఉంటుంది. గతంలో ఈ అనుమతులు ఇచ్చిన సంబంధిత అధికారుల పైన కూడా చర్యలు తీసుకుంటే రాబోవు రోజుల్లో ఏ అధికారి కూడా అక్రమ లేఔట్లకు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడానికి జంకే అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం..

**-కలెక్టర్లకు కీలక ఆదేశాలు**

**హైదరాబాద్, శుభ తెలంగాణ:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ జాబితా, పోలింగ్ బూత్?ల ఏర్పాటుతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. రానున్న నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేసేందుకు అందరూ సమాయత్తం కావాలని ఈ సందర్భంగా కలెక్టర్లను కమిషనర్ ఆదేశించారు. కాగా, మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మొదట సర్పంచ్, తర్వాత జెడ్పీ, ఎంపీటీసీ ఆ తర్వాత మునిసిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్నికల షెడ్యూల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, 21వ తేదీన ఫైనల్ ఓటర్ లిస్ట్?ను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 ఓటర్లు.. 650 ఓట్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈసీ డిసైడ్ అయ్యింది. లోకల్ బాడీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధం అవుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు దక్కించుకోవాలని వ్యూహాలు మొదలుపెట్టగా.. బీఆర్ఎస్, బీజేపీ లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి.




## ప్రజలు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి...

**శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్.**



**చేవెళ్ల , శుభ తెలంగాణ:** ప్రజలు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంకర్పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రోగాలు విజృంభిస్తున్నందున గ్రామాల్లో కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల మధ్య గుంతలలో నీరు నిలవకుండా చూడాలని, ఎప్పటికప్పుడు మురుగునీరు ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లించాలని తెలిపారు. విష జ్వరాలు వస్తున్నందున ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున గ్రామాలు ఇనుప విద్యుత్ స్తంభాలు లేకుండా చూసుకోవాలని, ట్రాన్స్ఫార్మర్ల వద్ద కంచెను ఏర్పాటు చేయాలని చెప్పారు. రాబోయే గణేష్ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు. ఏమైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లి సిఐ హబీబుల్లాఖాన్, తాసిల్దార్ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వికారాబాద్ పట్టణంలో వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు రాకూడదు..

**-వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్**






**వికారాబాద్, శుభ తెలంగాణ:** వికారాబాద్ పట్టణంలో రాత్రి సమయంలో ఎక్కడ కూడా వీధిలైట్లు వెలగడం లేదనే ఫిర్యాదులు రాకుండా, వీధిలైట్లతో పట్టణంలో వెలుగులు విరజిమ్మేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఆలంపల్లి ప్రధాన రోడ్డులోని బిజేఆర్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాతో పాటు ఇతర ప్రధాన కూడలిలలో జరిగిన హై మాస్ట్ లైట్ల మరమ్మతు పనులను చైర్ పర్సన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వారం 10 రోజులలో మరమ్మతు పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ సిబ్బంది రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు డీ..

**ముగ్గురికి గాయాలు**

**సూచిక బోర్డు లు లేకపోవడం తో వరస ప్రమాదాలు , పట్టించుకోని అధికారులు**



**చేవెళ్ల , శుభ తెలంగాణ:** శంకర్ పల్లి మండలంలోని కొండకల్-మోకిల గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణం చేస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శంకర్ పల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన స్విఫ్ట్ డిజైర్ కార్ లో కొల్లూరు వైపు వెళుతూ ఉండగా, ఎదురుగా ఇద్దరు ప్రయాణికులతో వస్తున్న ఊబర్ వాహనం స్విఫ్ట్ డిజైర్ ను ఢీకొట్టడం జరిగింది. దీంతో ఉబర్ లో ప్రయాణిస్తున్న ఒకరికి కాలు విరుగగా మరొకరు స్వల్ప గాయాలు అయ్యాయి. స్విఫ్ట్ డిజైర్ లో ఉన్న వ్యక్తికి ఎటువంటి ప్రమాదం కాలేదు. రెండు వాహనాలలో ప్రయాణిస్తున్న ముగ్గురిని పటాన్ చెరువు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. రోడ్డుపై ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మోకిల పోలీసులు రోడ్డుపై ప్రమాదంలో ధ్వంసమైన రెండు కార్లను రోడ్డుపై నుండి తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ మేరకు మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేడియల్ రోడ్డులో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి..... కొండగల్ గ్రామ శివారులోని రేడియల్ రోడ్డులో ప్రమాదన ఫోటోలు సూచికలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాద సూచిక లేనందున నిత్యం ప్రమాదాలు జరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఫోర్త్ సిటీ పేరుతో భూములు కొల్లగొడుతున్నారు





**హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. రుణమాఫీ అంశాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తీరును తప్పుబట్టారు. రుణమాఫీ గురించి రేవంత్ రెడ్డి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని పేర్కొన్నారు. రుణమాఫీ చేయని పెద్ద గజదొంగ రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. దేవుళ్లని మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డిద పేర్కొన్నారు. రుణమాఫీ ఇంకా కానేలేదని మంత్రులు చెబుతుండగా.. రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీకి వెళ్లి రైతులందరికీ రుణమాఫీ చేశామని రాహుల్ గాంధీకి చెబుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే తాను ఆహ్వానించి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గానికి తీసుకెళ్లి రుణమాఫీ అందరికి జరగలేదని నిరూపిస్తానని సవాల్ చేశారు.ఆగస్టు 15వ తేదీలోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలని తాను సవాల్ చేసినట్టు మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ, ఇంకా రైతులందరికీ రుణమాఫీ కాలేదని, వాస్తవం ఇలా ఉండగా రేవంత్ రెడ్డి మాత్రం ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షపాత పార్టీ అని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి అని వివరించారు. రైతుల పక్షాన నిలిచిన పార్టీ తమదేనని, రైతులు ఢిల్లీలో ధర్నా చేసినప్పుడూ తమ పార్టీ బాసటగా నిలిచిందని గుర్తు చేశారు.ఇక హైడ్రా గురించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు కూల్చివేతల సర్కారు అని హరీశ్ రావు విమర్శించారు. దేవుళ్ల మీద ఓట్లు వేసి ప్రజల విశ్వాసాన్ని కూల్చివేసిన చరిత్ర రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. బుద్ధ భవన్ ఆఫీస్ హుస్సేన్ సాగర్ నాలా కింద ఉన్నదని, మరి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుద్ధ భవన్‌ను ఎందుకు కూలగొట్టడం లేదని ప్రశ్నించారు. ముందు బుద్ధ భవన్ కూల్చి మిగిలిన వాటిని కూల్చాలని, మరి ఐమాక్స్, లుంబిని పార్క్, బోట్స్ క్లబ్‌ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ముందు వాటిని కూల్చకుండా తమ పార్టీ ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఆఫీసు కూలగొడతామనడం సరికాదని అభిప్రాయపడ్డారు.వాల్మీకీ స్కామ్ జరిగిందని హరీశ్ రావు పేర్కొంటూ.. కర్ణాటక ప్రభుత్వ ఖజానా నుంచి నేరుగా గోల్డ్ షాపులకు, కార్ల అకౌంట్స్‌కు డబ్బులు వెళ్లాయని తెలిపారు. 9 కంపెనీలకు డబ్బులు వచ్చినట్టు అన్ని చూపించామని, వాల్మికి స్కామ్‌ను ఇంత వరకు ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఖండించలేదని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని, అందుకే బీజేపీ కూడా నోరెత్తడం లేదని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే వాల్మికి స్కామ్‌లో ఈడీ విచారణ చేపట్టాలని, ఈ స్కామ్‌లో రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలోనూ పెద్ద ఎత్తున కుంభకోణాలు జరుగుతున్నాయని, సివిల్ సప్లయ్‌లో కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు.ఇక రేవంత్ రెడ్డి కొత్తగా నాలుగో సిటీ అని పాట పాడుతున్నారని, ఈ పేరు మీద ప్రభుత్వ భూములు కొల్లగొట్టే పనిలో ఉన్నారని హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కందుకూరు గ్రామంలో 385 ఎకరాలు, తుక్కుగూడలో 25 ఎకరాల భూమిని కొల్లగొడుతున్నారన్నారు. ముచ్చర్ల గ్రామంలో ప్రభుత్వ పెద్దలుగా చెలామణి అవుతున్న సీఎం రేవంత్ రెడ్డి తమ్ముళ్ల పీఏల పేరు మీద భూములు చెలామణి అవుతున్నాయని ఆరోపించారు. త్వరలోనే అన్ని వివరాలను తాను బట్టబయలు చేయబోతున్నట్టు తెలిపారు.

# దుర్గం చెరువు ఆక్రమణదారులకు నోటీసులు

**నెల రోజుల్లోగా ఖాళీ చేయాలని అల్టిమేటం**



**హైదరాబాద్ :** చెరువు భూముల ఆక్రమణలపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అక్రమణలకు పాల్పడ్డవారు ఎంతటి వారైనా వదలడం లేదు. తాజాగా.. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి కూడా కూల్చివేత నోటీసులు అంటించారు. ఈ ఇష్యూ ఇప్పుడు టాక్ ఆఫ్ ది తెలంగాణగా మారింది. హైదరాబాద్ నగరంలోని దుర్గంచెరువు చుట్టూ అక్రమ కట్టడాలు ఎన్నో వెలిశాయి. అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు, కార్యాలయంతో సహా పలు ప్రముఖ నిర్మాణాలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. వాటిని 30 రోజుల్లోగా తొలగించాలని నోటీసులు అంటించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. చెరువుకు ఆనుకుని ఉన్న నెక్టార్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరి హిల్స్, అమర్ సొసైటీ వాసులకు కూడా నోటీసులు జారీ చేశారు. వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద ఈ నోటీసులు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటిని నిర్ణీత గడువులోగా స్వచ్ఛందంగా కూల్చివేయాలని ఆదేశించారు. లేదంటే అధికారులే కూల్చివేతలు చేపడతారని హెచ్చరించారు.కాగా హైడ్రా నోటీసులపై స్పందించిన సీఎం రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి స్పందించారు. 2015లో అమర్‌సొసైటీలో నివాసాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు సమయంలో ఎఫ్‌టీఎల్‌లో ఉందనే సమాచారం లేదని.. ఆ పరిధిలో ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నా అభ్యంతరం లేదని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు.నగరం నడిబొడ్డున ఉన్న దుర్గంచెరువు, తీగలవంతెన హైదరాబాద్‌కి ఐకాన్‌గా మారిపోయింది. ఒకప్పుడు 100 ఎకరాల విస్తీర్ణంలో దుర్గం చెరువు ఉండేది. ప్రస్తుతం అది కాస్తా 84 ఎకరాలకు పరిమితమైంది. దాదాపు 16 ఎకరాలకు పైనే కబ్జాకు గురైంది. పదేళ్ల కిందట ఈ ఏరియాను నాన్-డెవలప్‌మెంట్ జోన్‌గా గుర్తించారు. అయితే దానికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో క్రమంగా విస్తీర్ణం తగ్గిపోతోంది. దుర్గం చెరువు చుట్టూ ఎన్నో విలాసవంతమైన విల్లాలు వెలిశాయి. రాజకీయ నాయకులు, ఇంజినీర్లు, రిటైర్డ్ బ్యూరోక్రాట్‌లు, ఎంతోమంది ఉన్నత స్థాయి వ్యక్తులు ఈ చెరువు చుట్టూ.. ఆక్రమణకు గురైన ప్రాంతాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. వారిలో చాలామందికి అధికారులు తాజాగా నోటీసులు ఇచ్చారు. ఆ ఆక్రమణలను తొలగిస్తే.. కబ్జాకు గురైన దుర్గం చెరువుకు పునర్వైభవం వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

## నాలుగు బంగారు పతకాలు గెలుచుకున్న యువ పవర్‌లిఫ్టర్ విక్రమ్..



(హైదరాబాద్/శుభ తెలంగాణ)తెలంగాణకు చెందిన యువ పవర్‌లిఫ్టర్ పొన్నాడ విక్రమ్ తన ప్రతిభతో రాష్ట్రాన్ని గర్వపడేలా చేశాడు.ఇంటర్మీడియట్ 2వ సంవత్సరంలోనే,విక్రమ్ ఇటీవల నేపాల్ ఖాట్మండులో జరిగిన వరల్డ్ పవర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ పోటీలలో 74 కేజీ విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించాడు.స్క్వాట్,బెంచ్‌ప్రెస్,డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో తన సత్తా చాటిన విక్రమ్,కేవలం 16సంవత్సరాల వయస్సులోనే ప్రపంచవ్యాప్తంగా అన్ని అంతర్జాతీయ యూత్ గేమ్‌లకు అర్హత పొందాడు.వచ్చే ఏడాది స్విట్జర్లాండ్‌లో నిర్వహించబడే పోటీల్లో విక్రమ్ పాల్గొనబోతున్నాడు.ఈ అద్భుత విజయంతో తెలంగాణను అంతర్జాతీయ వేదికపై నిలిపిన విక్రమ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్షధ్వానాలతో అభినందిస్తున్నారు.

## సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని లా సెక్రటరీకి వినతి..



**(శుభ తెలంగాణ /తెలంగాణ సచివాలయం)** తెలంగాణ సచివాలయంలో లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి కురుమ లా చీఫ్ సెక్రటరీ రెడ్ల తిరుపతిని కలసి,ప్రభుత్వ న్యాయవాదుల నియామకాలలో సామాజిక న్యాయం పాటించాలని కోరారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ న్యాయవాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని,నియామకాలు సామాజిక కోణంలో న్యాయవాదులందరికీ న్యాయం జరిగేలా చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.లా సెక్రటరీ సానుకూలంగా స్పందించి,ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోరకంటివినోద్,కుమార్,మహేష్,హనుమంతుకరికే,మల్లేష్,రవీందర్ అనేకమంది న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


**వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి: ఎంపీడీవో వెంకయ్య గౌడ్ :**



**శంకర్పల్లి, శుభ తెలంగాణ: ఆగస్టు 29** ప్రజలు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంకర్పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రోగాలు విజృంభిస్తున్నందున గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల మధ్య గుంతలలో నీరు నిలవకుండా చూడాలని, ఎప్పటికప్పుడు మురుగునీరు ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ ను చెల్లించాలని తెలిపారు. విష జ్వరాలు వస్తున్నందున ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున గ్రామాలు ఇనుప విద్యుత్ స్తంభాలు లేకుండా చూసుకోవాలని, ట్రాన్స్ఫార్మర్ల వద్ద కంచెను ఏర్పాటు చేయాలని చెప్పారు. రాబోయే గణేష్ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు. ఏమైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లి సిఐ హబీబుల్లాఖాన్, తాసిల్దార్ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొండకల్ రేడియల్ రోడ్ లో రెండు కార్లు డీ.. ముగ్గురికి గాయాలు

**సూచిక బోర్డు లు లేకపోవడం తో వరస ప్రమాదాలు , పట్టించుకోని అధికారులు**





**శంకరపల్లి :ఆగస్ట్ 29:** శంకర్ పల్లి మండలంలోని కొండకల్ మరియు మోకిల, మధ్యలో ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డుపై, జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణం చేస్తున్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి, శంకర్ పల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన స్విఫ్ట్ డిజైర్ కార్ లో కొల్లూరు వైపు వెళుతూ ఉండగా, ఎదురుగా ఇద్దరు ప్రయాణికులతో వస్తున్న ఊబర్ వాహనం స్విఫ్ట్ డిజైర్ ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది, ఉబర్ లో ప్రయాణం చేస్తున్న ఒకరికి కాలు విరుగగా మరొకరు చిన్న గాయంతో బయటపడ్డారు, స్విఫ్ట్ డిజైర్ లో ఉన్న వ్యక్తికి ఎటువంటి ఇబ్బంది కలగలేదు, రెండు వాహనాలలో ప్రయాణిస్తున్న ముగ్గురిని పటాన్ చెరువు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు, రోడ్డుపై ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది, మోకిల పోలీసులు రోడ్డుపై ప్రమాదంలో ధ్వంసమైన రెండు కార్లను రోడ్డుపై నుండి తొలగించి ట్రాఫిక్ ను పూర్తిగా క్లియర్ చేశారు, మొకిల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## నందమూరి హరికృష్ణ 6వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన టిడిపి నేతలు...




**(కాప్రా/శుభ తెలంగాణ)** ఉప్పల్ నియోజకవర్గం ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డ,భవాని నగర్‌లో టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి నిరుగొండ సతీష్ బాబు ఆధ్వర్యంలో మాజీ మంత్రి దివంగత నందమూరి హరికృష్ణ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్,గడ్డమీది రాములు యాదవ్,దూడల సాంబమూర్తి గౌడ్, నిర్మల,సాంబశివరావు, శ్రీరాములు,శివానంద్,బింగి భిక్షపతిగౌడ్,తిక్కప్రకాష్,పరంధామయ్య,రవి,గోబెరు రమేష్,నందం గౌడ్,క్రిష్ణ,సత్యం,సతీష్ కుమార్,నవీన్,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బ్రేకప్ చెప్పినా... వదలని ఉన్మాది

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. యువతిని ఓ యువకుడు కత్తితో పొడిచి చంపాడు.. అయితే.. ఆమెను చంపింది మాజీ ప్రియుడేనని పోలీసులు తెలిపారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపన్ పల్లి తండాలో చోటుచేసుకుంది.. అర్ధరాత్రి ప్రియురాలిపై కత్తితో దాడి చేసి ప్రియుడు పరారయ్యాడు.. ఈ క్రమంలో.. అడ్డుకోబోయిన మరో ముగ్గురు యువతులకు కూడా గాయాలయ్యాయి.. ప్రేమించిన యువతి బ్రేకప్ చెప్పింది.. అయినా.. ఆమెను పెళ్లి చేసుకోవాలంటూ వెంటపడిన యువకుడు ఆమెను చంపి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక బీదర్కు చెందిన రాకేశ్ అనే వ్యక్తి మాదాపూర్లోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటున్నాడు.

## నెలకు రెండుసార్లు పీరియడ్స్.. కారణం అదే అంటున్న నిపుణులు..



ప్రతి స్త్రీకి ఒక నిర్దిష్ట వయస్సు తర్వాత పీరియడ్స్ రావడం మొదలవుతుంది. ప్రతి స్త్రీ ఋతు చక్రం భిన్నంగా ఉంటుంది. ఈ పీరియడ్ సైకిల్ 28 రోజుల నుండి 45 రోజుల వరకు సాధారణమైనదిగా పరిగణిస్తారు. అంటే ఈ వ్యవధిలో స్త్రీకి రుతుక్రమం వస్తుంది. కానీ చాలా మంది స్త్రీలకు నెలలో రెండుసార్లు పీరియడ్స్ వస్తుంటాయి. ఇది సాధారణ సమస్య అస్సలే కాదం టున్నారు నిపుణులు. తరచూ ఇలాగే జరిగితే తప్పకుండా వైద్యులను సంప్రదించాలంటున్నారు నిపుణులు. ఇంతకీ ఇలా ఎందుకు జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.


ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు మహిళల్లో పీరియడ్స్ ను నియంత్రిస్తాయంటున్నారు సీనియర్ గైనకాలజిస్టులు. అస్తవ్యస్త జీవనశైలి కారణంగా, గర్భాశయం పరిమాణం లో మార్పు, ఈ హార్మోన్ల సమతుల్యత మారుతుందని చెబు తున్నారు. దీని కారణంగా పీరియడ్స్ చక్రంలో కూడా మా ర్పులు కనిపిస్తాయట. చాలా మంది మహిళల్లో పీరియడ్స్ సక్రమంగా రాకపోవడానికి ఇదే కారణమంటున్నారు. హార్మోన్లలో ఏదైనా అసమానత పీరియడ్స్‌ను ప్రభావితం చేస్తుందంటున్నారు. ఇది నెలకు రెండుసార్లు పీరియడ్స్‌కు దారి తీస్తుందట. అలాగే ఇది సాధారణమైన సమస్య కాదని, ఇలా జరిగితే కచ్చితంగా వైద్యుడిని సంప్రదిం చాలి. చాలా మంది మహిళల్లో హార్మోన్లతో పాటు ఒత్తిడి కూడా ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతు న్నారు. ఒత్తిడి మన హార్మోన్ల పై చెడు ప్రభావాన్ని చూపు తుంది. అందుకే ఎక్కువ ఒత్తిడికి లోనయ్యే మహిళల్లో పీరియడ్స్‌లో లోపాలు ఎక్కువగా కనిపిస్తాయని చెబుతున్నారు. థైరాయిడ్ వల్ల కూడా పీరియడ్స్ లో అవకతవకలు జరుగుతాయం టున్నారు నిపుణులు. వాస్తవానికి, పీరియడ్స్‌ను నియంత్రించే ప్రొజెస్టెరాన్, ఈస్ట్రోజెన్ హార్మోన్లు థైరాయిడ్ గ్రంథిలో మాత్రమే ఉత్పత్తి అవుతాయి. అందువల్ల, థైరాయిడ్ సంబంధిత సమస్యలు ఉన్న స్త్రీలకు ఎక్కువగా పీరియడ్స్ సక్రమంగా రాకుండా ఉంటాయి. హైపర్ థైరాయిడిజం విషయంలో, పీరియడ్స్ ఆలస్యం అవుతుంది.

## రోడ్ సైడ్ ఫుడ్ ఎక్కువగా తింటున్నారా..



బిజీలైఫ్‌కి అలవాటు పడి ఈరోజుల్లో చాలామంది బయట ఫుడ్ ఎక్కువగా తింటున్నారు. తీరిక లేక ఇంట్లో వండుకోవడమే మానేస్తున్నారు. దీంతో ఎంతో అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. ఇంట్లో వండిన అయితే కొందరికి అసలు టేస్ట్ అనిపించదు. అదే బయట ఫుడ్ ఎలా ఉన్నా కూడా తినేస్తారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు అందరూ కూడా బయట ఫుడ్ అంటేనే ఇష్టం చూపిస్తారు. ముఖ్యంగా జంక్ ఫుడ్‌కి అయితే చాలా ఇంట్రెస్ట్ చూపిస్తారు. సాయంత్రం అయితే చాలు.. తప్పకుండా ఫాస్ట్‌ఫుడ్ తింటారు. ఇవి లభించే ప్లేస్‌లు కూడా అంత మంచిగా ఉండవు. అయిన తినడానికి ఇష్టపడతారు. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో అయితే ఎక్కువగా తింటారు. ఈ సీజన్‌లో వీటిని అతిగా తినడం వల్ల వైరల్ ఫీవర్లు వంటివి వస్తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాసెస్ చేసిన ఫుడ్ తినడం వల్ల శరీరం అనారోగ్య సమస్యలకు గురవుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. ఈ సీజన్‌లో బయట ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగీ, విరేచనాలు, కలరా వంటి వైరల్ ఫీవర్లు కూడా వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి వీటికి దూరంగా ఉండటం మేలు. బయట ఫుడ్స్‌లో అధికంగా ఉప్పు, మసాలా, ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి మన శరీరంలోకి వెళ్తే అనారోగ్య సమస్యలు వస్తాయి. దీనివల్ల ఆకస్మిక మరణం కూడా సంభవిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రుచిగా ఉండాలని కెమికల్స్, రంగులు వంటివ ఫుడ్‌లో కలుపుతారు. వీటివల్ల అనేక సమస్యలు వస్తాయి. ఈ జంక్ ఫుడ్స్‌లో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. దీంతో గుండె సంబంధిత సమస్యలు, రక్తనాళాల్లో పూడికలు వంటివి ఏర్పడుతున్నాయి. పిల్లలకు అయితే ఈ ఫుడ్స్ అస్సలు పెట్టకూడదు. ఇందులో హానికరమైన కొవ్వులు ఉంటాయి. వీటివల్ల మూత్రపిండాలు దెబ్బతింటాయి. అలాగే మూత్రపిండాలపై ఒత్తిడికి దారితీసి దాని పనితీరును తగ్గిస్తుంది. ఫాస్ట్‌ఫుడ్ తినడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పెరుగుతుంది. దీంతో ఎక్కువగా బరువు పెరుగుతారు. ఈ ఫుడ్స్ వల్ల టైప్ 2 డయాబెటిస్ కూడా వస్తుంది. వీటిలో మినరల్స్, ప్రొటీన్స్ తక్కువగా ఉంటాయి. వీటివల్ల శరీరానికి ఎలాంటి బలం ఉండదు. నీరసం అయిపోతారు. అలాగే మధుమేహం, ఊబకాయం, హైబీపీ వంటి వ్యాధుల బారిన కూడా పడతారు. బాడీ చాలా వీక్ అయిపోయి రోగనిరోధక శక్తి పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో జ్వరం, తలనొప్పితో పాటు డెంగీ, మలేరియా వంటివి వస్తాయి. అలాగే వీటిని డైలీ తినడం వల్ల క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పేగు క్యాన్సర్ వస్తుందని వైద్యులు అంటున్నారు. వీలైనంత తినకపోతే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## హాయిగా నిద్రపట్టాలంటే..



ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్ లేదా మారిన జీవనశైలి వల్ల చాలామంది సరిగ్గా నిద్రపోవడం లేదు. మనిషికి తిండి, నీరు ఎంత ముఖ్యమూ నిద్ర కూడా అంతే ముఖ్యం. తిండి లేకపోయిన కొన్ని రోజులు బ్రతకగలరు ఏమో.. కానీ నిద్ర లేకపోతే బ్రతకలేరు. ఒక్క రోజు నిద్ర తక్కువైన మనిషి చాలా నీరసంగా అయిపోతారు. ఏ పని కూడా సరిగ్గా చేయలేరు. అంత ఇంట్రెస్ట్ కూడా ఉండదు. ఈరోజుల్లో అయితే ఎక్కువగా సోషల్ మీడియాకు బానిస అయ్యి.. పగలు, రాత్రి తేడా లేకుండా వాడుతున్నారు. మొబైల్ నుంచి వచ్చే ఆ కిరణాల వల్ల తొందరగా నిద్ర పట్టదు. దీనివల్ల చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. మరి ఎలాంటి ఇబ్బంది లేకుండా కళ్లు మూసిన వెంటనే నిద్ర పట్టాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. నిద్ర పట్టాలంటే ఫుల్‌గా తినాలి. సమయానికి ఆహారం తీసుకోవాలి. అలాగే ఉదయం పూట ఎక్కువగా ఆహారం తీసుకుని.. రాత్రిపూట కొంచెం తక్కువగా తీసుకోవాలి. పడుకునే ముందు గోరువెచ్చని పాలు తాగాలి. పాలు తాగడం ఇష్టం లేని వాళ్లు గోరువెచ్చని నీరు తాగాలి. ఇలా తాగి పడుకుంటే హాయిగా నిద్రపడుతుంది. వేడి నీరు కంటే పాలు మంచివి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్, సెరోటోనిన్ హాయిగా నిద్రపోవడానికి సాయపడుతుంది. కాబట్టి పాలు తాగడం అలవాటు చేసుకోండి. అలాగే నిద్రపోయే ముందు చెర్రీ జ్యూస్ లేదా ఏదైనా పండ్ల జ్యూస్ తాగడం అలవాటు చేసుకోండి. దీనివల్ల బాగా నిద్రపడుతుంది. వీటితో డ్రైఫూట్స్, ఫైబర్ ఎక్కువగా ఉండే పదార్థాలు, కివీ పండ్లు, బెర్రీస్, దానిమ్మ వంటివి తీసుకోవాలి. మంచి ఫుడ్ తీసుకోవడంతో పాటు మానసికంగా సంతోషంగా ఉండాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలి. ఎక్కువగా టెన్షన్ తీసుకున్నా కూడా హాయిగా పడుకోలేరు. బయట ఫుడ్ తినడం తగ్గించాలి. ప్రాసెస్ చేసిన ఆహారం, వేపుళ్లు, బర్గర్‌లు, కొవ్వులు, వైట్ బ్రెడ్, పాస్తా, కెఫిన్ ఉండే పదార్థాలు, ఆల్కహాల్ వంటి వాటికి దూరంగా ఉండాలి. రాత్రిపూట భోజనం లేటుగా చేయకుండా తొందరగా చేయడం అలవాటు చేసుకోవాలి. రాత్రి పూట మితంగా మాత్రమే ఆహారం తీసుకోవాలి. అధికంగా ఫుడ్ తీసుకోకూడదు. అలాగే శారీరక శ్రమ లేకపోవడం వల్ల కూడా నిద్రపట్టదు. కాబట్టి వ్యాయామం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. నిద్రపోయే గంట ముందు మొబైల్, కంప్యూటర్, టీవీ వంటి వాటికి దూరంగా ఉండండి. వీటి నుంచి వచ్చే కిరణాల వల్ల తొందరగా నిద్రపట్టదు. అలాగే కళ్లు సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. నిద్రపోయే ముందు పాటలు లేదా స్టోరీలు వినడం, పుస్తకాలు చదవడం వంటివి చేస్తే తొందరగా నిద్రపడుతుంది. కళ్లు మూసిన పది నిమిషాల్లో హాయిగా నిద్రపోవచ్చు.

## పిల్లలు ఎక్కువ సార్లు మూత్ర విసర్జనకు వెళ్తున్నారా?

తరచుగా మూత్ర విసర్జన చేయడం అనేది పిల్లల్లో కనిపించే సహజ లక్షణమే. అయితే ఇది సాధారణంగా ఉన్నంత వరకే అంటున్నారు వైద్య నిపుణులు. నార్మల్ కంటే ఎక్కువసార్లు పిల్లలు యూరిన్‌కు పోవడం, వారు ఇబ్బందిగా ఫీల్ అవడం వంటివి గమనిస్తే ఏదో సమస్య ఉన్నట్లు అనుమానించాలని చెప్తున్నారు. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల యూరిన్ ఎక్కువసార్లు పోతే పర్లేదు కానీ.. కొందరు పిల్లలు వాటర్ తాగకపోయినా రోజుకూ 10 నుంచి 12 సార్లు పాస్ చేస్తుంటారు. అలాంటప్పుడు దీనిని మూత్ర అనియంత్రిత వ్యాధి అయినటువంటి 'పొలియూరియా'గా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా 3 నుంచి 8 ఏండ్ల వయస్సు గల పిల్లలు ఈ సమస్యను ఎదుర్కొనే అవకాశం ఎక్కువ. ఈ వ్యాధి బారిన పడ్డ పిల్లలు కొందరైతే రోజులో 10 నుంచి 30 సార్లు కూడా యూరిన్‌కు పోతుంటారు. అట్లనే పాస్ చేస్తున్న సమయంలో నొప్పి కూడా వస్తుంది. అలా ఎందుకు జరుగుతుందో అవగాహన లేక చాలామంది పిల్లలు ఈ విషయాన్ని చెప్పకుండా మిన్నకుండి పోతుంటారు. కాకపోతే పేరెంట్స్ వారిని కాస్త అబ్జర్వ్ చేస్తే అర్థమైపోతుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. ఎనిమిది సంవత్సరాలలోపు పిల్లలు రాత్రిపూట మాత్రమే ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు పోతుంటే అది నోక్టురియా వ్యాధి వల్ల కూడా కావచ్చు అంటున్నారు డాక్టర్లు. ఈ వ్యాధి ఉన్నవారు నిద్రలో మంచంపైనే తమకు తెలియకుండానే మూత్ర విసర్జన చేస్తుంటారు. ఎక్కువకాలం ఈ సమస్యను ఎదుర్కొనే పిల్లల్లో మూత్ర విసర్జన సమయంలో మంట, అప్పుడప్పుడూ జ్వరం, కడుపు నొప్పి, అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటి లక్షణాలు కూడా అరుదుగా కనిపిస్తుంటాయి. తరచుగా ఆటల్లో మునిగిపోయి, స్కూళ్లల్లో ఉన్నప్పుడు పిల్లలు మూత్రాన్ని ఆపుకోవడం, అలాగే స్పైసీ ఫుడ్స్ తినడం, సిట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉండే పండ్లను తినడం, అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు, బాత్రూములను యూజ్ చేయడం వంటి కారణాలతో అధిక మూత్ర విసర్జన వ్యాధులు వస్తుంటాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. మూత్ర మార్గంలో బ్యాక్టీరియా చేరడం కొన్నిసార్లు ఇన్ఫెక్షన్లకు కారణం అవుతుందని అంటున్నారు. కాబట్టి పిల్లల్లో అధిక మూత్ర విసర్జన సమస్యలు, లక్షణాలు ఐదారు రోజులకు మించి కనిపించిస్తే డాక్టర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు.



## గుడ్డు.. పనీర్.. ఏది బెటర్?





మనిషి ఆరోగ్యానికి పౌష్టికాహారం కావాల్సి ఉంటుంది. కొన్ని ఆహార పదార్థాల్లో ఎక్కువగా ప్రోటీన్లు ఉంటాయి. కానీ వీటిని ఎక్కువగా తినడానికి ఇష్టపడరు. వెజ్ కంటే నాన్ వెజ్ లో ఎక్కువగా ప్రోటీన్లు ఉంటాయని కొందరి భావన. అందుకే వారు ఎక్కువగా నాన్ వెజ్ పదార్థాలనే తింటుంటారు. ఈ నేపథ్యంలో గుడ్లు, మాంసాహారం, చేపలు తీసుకుంటూ ఉంటారు. మరికొందరు మాత్రం వెజ్ పదార్థాల్లోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని శాఖాహారులు వాదిస్తుంటారు. వెజ్ కంటెంట్ అయిన కూరగాలయతో పాటు పనీర్ తింటుంటారు. ఈ నేపథ్యంలో గుడ్డు, పనీర్ లో ఎటువంటి పోషకాలు ఉంటాయి. వీటి మధ్య తేడాలు ఎలా ఉంటాయి? ఆ వివరాల్లోకి వెళితే.. రోజుకో గుడ్డు తినండి.. బలంగా ఉండండి.. అని ప్రతిరోజూ టీవీలో యాడ్ చూస్తుంటాం. ఈ యాడ్ లో చెప్పినట్లుగానే ప్రతిరోజూ ఒక గుడ్డు తినడం వల్ల శరీరానికి ఎన్నో రకాల ప్రొటీన్లు అందుతాయి. అందుకే చిన్న పిల్లల నుంచి పెద్దవారు ప్రతిరోజూ గుడ్డు తినడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే పనీర్ లోనూ విలువైన పోషకాలు ఉన్నాయి. పనీర్ తో కర్రీతో పాటు వివిధ రకాల పదార్థాలు చేసుకుంటూ ఉంటారు. దీనిని కర్రీతో పాటు ఇతర స్వీట్లు కూడా చేసుకోవచ్చు. దీనిని తినడం వల్ల అదనపు శక్తి లభిస్తుందని చెబుతున్నారు. ఒక గుడ్డులో 6 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇందులో శరీరానికి కావాల్సిన తొమ్మిది రకాల అమైనో అమ్లాలు ఉంటాయి. గుడ్డులో ఎక్కువగా కాల్షియం ఉంటుంది. ఇందులో ఎక్కువగా ప్రోటీన్లు ఉన్నప్పటికీ తొందరగా డైజేషన్ అవుతుంది. కండరాల బలోపేతానికి, శరీర వృద్ధికి గుడ్డు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఒక గుడ్డులో తక్కువ మొత్తంలో క్యాలరీలు కలిగి ఉంటాయి. అందువల్ల దీనిని ఎక్కువగా తీసుకున్నా బరువు పెరిగే ఆస్కారం ఉండదు. గుడ్డును కొందరు శాఖాహారులు కూడా తీసుకోవచ్చు. పనీర్ వెజ్ పదార్థం అయినప్పటికీ ఇందులో గుడ్డుతో సమానంగా పోషకాలు ఉంటాయి. పనీర్ లోనూ కాల్షియం అధిక మోతాదులో ఉంటుంది. వంద గ్రాముల పనీర్ లో 18 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది గుడ్డులో కంటే ఎక్కువ. అయితే ఇది పాల పదార్థం. అందువల్ల ఇది తీసుకున్నప్పుడు జీర్ణం కావడానికి కాస్త సమయం పడుతుంది. అలాగే పనీర్ ను తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలి. ఇందులో క్యాలరీల శాతం అధికంగా ఉంటుంది. గుడ్డు , పనీర్ లో ఏదీ బెటర్ అనే విషయానికి వస్తే రెండు శరీరానికి ఆరోగ్యాన్ని ఇచ్చేవే. అయితే గుడ్డును డైట్ లాగా మార్చుకొని రోజుకో గుడ్డు తీసుకోవాలి. పనీర్ ను రకరకాల రెసిపీలు చేసుకుంటే టేస్టీగా తినొచ్చు. అయితే జీర్ణసమస్యలు ఉన్న వారు మాత్రం పనీర్ కు దూరంగా ఉండడం లేదా తక్కువ మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అనారోగ్యాల సయాల్లో గుడ్డుకు దూరంగా ఉండాలి. ప్రత్యేక వ్యాధులు ఉన్న వారు వైద్యుల సలహా మేరకే గుడ్డు తినేందుకు ఇష్టపడాలని కొందరు ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110